# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు.

❖ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పరిశ్రమగా అభివృద్ధి చేస్తూ.. భారీ స్థాయిలో ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

❖ స్త్రీశక్తి పథకం అమలుతో రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల శాతం గణనీయంగా పెరిగిందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

❖ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి పనులు 95 శాతం పూర్తయ్యాయని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి శాసనమండలిలో వెల్లడించారు.

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా పర్యటనలో భాగంగా వెలుగొండ ప్రాజెక్టులో 456 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించే ఫీడర్ కెనాల్ పనులకు ఈరోజు శంకుస్థాపన చేశారు. ఫీడర్ కాలువ లైనింగ్ పనులను స్వయంగా పరిశీలించిన ఆయన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్లమల సాగర్ ఫీడర్ కెనాల్ ను విహంగ వీక్షణం ద్వారా ముఖ్యమంత్రి సమీక్షించారు. వెలిగొండ టన్నెల్స్ పనులతో పాటు క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్న వేర్వేరు ప్రాంతాల్లోని అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి ఎప్పటికప్పుడు తనకు తెలియచేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అనంతరం ముఖ్యమంత్రి మార్కాపురంలో జరిగిన బహిరంగ కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజల సౌకర్యం కోసం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశామని, మరో వరంగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీరు అందిస్తామన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయ్యాక 4 లక్షల 35 వేల ఎకరాలు సాగులోకి వస్తాయని, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి లాంటి నియోజకవర్గాలతో పాటు ఉదయగిరి, కడప, బద్వేలుకు కూడా నీళ్లు వెళ్తాయని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తూ.. భారీ స్థాయిలో ఉపాధి కల్పించడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శాసన మండలిలో ఈరోజు ఎమ్మెల్సీ సోము వీర్రాజు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను 39,264 మందికి ఉపాధి లభించనుందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి `పారిశ్రామిక హోదా` కల్పించడంతో గత 18 నెలల్లోనే రాష్ట్రానికి 20,088 కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని, ఇది ఒక విప్లవాత్మక మార్పు అని మంత్రి పేర్కొన్నారు. నూతన పర్యాటక పాలసీ 2024-29తో పర్యాటక రంగంలో వినూత్న మార్పులు, విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చామని మంత్రి కందుల దుర్గేష్ వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

========================

స్త్రీ శక్తి పథకం అమలుతో రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల శాతం 40 నుండి 65 శాతానికి పెరిగిందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో ఈరోజు జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోజుకు సగటున 25 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని వెల్లడించారు. మొత్తం 5 రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేస్తున్నామని, దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలిపారు. ఆటో డ్రైవర్ సేవలో పథకం ద్వారా 2025-26 సంవత్సరంలో 2,90,669 మంది డ్రైవర్లకు 436 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించామని మంత్రి తెలియజేశారు.

========================

రాష్ట్రంలో మంచినీరు కలుషితం కాకుండా చూసేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శాసనమండలిలో ఈరోజు సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ... ప్రతి మంగళవారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిర్దేశిత ప్రాంతాల్లో పైపు లైన్ ద్వారా సరఫరా జరిగే నీటి నమూనాలు సేకరించి పరీక్షిస్తున్నారన్నారు. నీరు కలుషితమైనట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత శాఖలను అప్రమత్తం చేసి, అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా అవసరాలకు తగినట్టు క్లోరినేషన్ చేపడుతున్నామని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ.. జల్‌జీవన్ మిషన్ ద్వారా సురక్షిత నీరు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

విరామం

========================

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి పనులు 95 శాతం పూర్తయ్యాయని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఈరోజు శాసమండలికి వెల్లడించారు. విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. విమానాశ్రయంలో పూర్తి వాణిజ్య కార్యకలాపాలు ఈ ఏడాది జూలై నాటికి ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే పోర్టులు, ఫిషింగ్ హార్బర్లకు సంబంధించి ఇతర సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలిచ్చారు. 18 నెలల కాలంలో రామాయపట్నం పోర్టుకు సంబంధించి 24.91 శాతం నిధులు, మచిలీపట్నం పోర్టుకు సంబంధించి 29.08 శాతం నిధులు ఖర్చు చేశామని చెప్పారు. పోర్టుల ప్రైవేటీకరణ అంశంపై ప్రభుత్వం వద్ద ఎటువంటి ప్రతిపాదనలు లేవని మంత్రి జనార్ధనరెడ్డి స్పష్టం చేశారు.

(వాయిస్ 26 సెకన్లు)

========================

బాల్య వివాహాలను అరికట్టి భావితరాల భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా వుందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ అన్నారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, అప్ హోల్డ్ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో బాల్య వివాహాల నిషేధ చట్టంపై అవగాహన కోసం ప్రచార రథాన్ని శ్రీభరత్ తన కార్యాలయం నుంచి ఈరోజు ప్రారంభించారు. బాల్య వివాహ నిషేధానికి సంబంధించిన గోడ పత్రికను ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... స్వచ్ఛంద సంస్థలు కొంత మేర బాల్య వివాహాలను అరికట్టగలుగుతున్నారని.. కానీ ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ఇటు వంటి ప్రచార రథాలు ఉపకరిస్తాయని చెప్పారు. అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రజలను విద్యావంతుల్ని చేయడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచినట్లయితే ఇటు వంటి సామాజిక రుగ్మతలను సమూలంగా అరికట్టవచ్చన్నారు.

========================

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పారదర్శకంగా, ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వహించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. అనకాపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆమె ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేసి, హాల్ టికెట్ల పరిశీలన, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పని తీరు, హాజరు నమోదుల విధానం తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, ఫ్యాన్లు, సరిపడ వెలుతురు వంటి మౌలిక వసతులు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య పరిరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు.

========================

గర్భాశాయ ముఖద్వార క్యాన్సర్ నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలోని 14 సంవత్సరాలు నిండిన సుమారు 3.45 లక్షల మంది బాలికలకు ఉచితంగా హెచ్.పీ.వీ. వ్యాక్సిన్ ఇవ్వనున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాక్సినేషన్ పంపిణీ కార్యక్రమ ప్రారంభం, ఇతర ఏర్పాట్లపై మంత్రి ఈరోజు ఉన్నతస్థాయి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1,683 ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ పంపిణీకి సంబంధించి సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. తొలి విడత కింద ఇప్పటివరకూ కేంద్ర ప్రభుత్వం నుండి లక్షా 90 వేలకుపైగా వ్యాక్సిన్ డోసులు వచ్చాయని, అవసరాలకు తగినట్టు వ్యాక్సిన్ కేంద్రం నుంచి అందుతుందని చెప్పారు.

========================
========================